క్లుప్తంగా

ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి

పాడా పీడీ చైత్ర వర్షిణి



పట్టు రైతుతో మాట్లాడుతున్న పీడీ చైత్ర వర్షిణి

పిఠాపురం: ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పాడా పీడీ చైత్ర వర్షిణి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అగ్రికల్చర్, ఇరిగేషన్, హార్టికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, సెరికల్చర్ శాఖల మండల స్థాయి అధికారులతో ఆమె గురువారం సమీక్షించి ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను, కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలని ఆమె కోరారు. అనంతరం గొల్లప్రోలు మండలంలో సుద్దగెడ్డ కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను, చేబ్రోలులో పట్టు గూళ్ల షెడ్‌ను, పట్టుపరిశ్రమ మార్కెట్‌ను సందర్శించారు. పీడీ వెంట ఏపీడీ పి.వసంత మాధవి, సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడి జెడ్పీ హై స్కూల్‌లో మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ ఇచ్చారు. పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులు పోషణ్‌బీ పఢాయీ బీ కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మానస, మణి తదితరులు పాల్గొన్నారు.

91వ సారి మాజీ సర్పంచ్ రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురువారం 91వ సారి రక్తదానం చేశారు. మండలం నడకుదురు గ్రామానికి చెందిన ఎ.రామయ్య విద్యుదాఘాతానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతనికి రక్తం అత్యవసరమన్న సమాచారాన్ని అందుకున్న తాతీలు జీజీహెచ్‌లోని బ్లడ్‌బ్యాంకుకు వెళ్లి ఓ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. దాతకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బాధితకుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బ్రాహ్మణ మహిళలకు భరోసాగా..

సౌగంధిక పురస్కారాల ప్రదానం



సౌగంధిక అవార్డుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

బోట్‌క్లబ్: బ్రాహ్మణ మహిళలు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు సౌగంధికా బ్రాహ్మణ మహిళ మణిహారం కృషి చేస్తుందని సంస్థ అధ్యక్షురాలు బాలాంతరపు సుచిత్ర పేర్కొన్నారు. దంటు కళాక్షేత్రంలో సంస్థ ఆధ్వర్యంలో 2వ వార్షికోత్సవాన్ని మహా కుంభ పేరిట గురువారం నిర్వహించారు. సామాజిక వేత్త నడింపల్లి యమున పటాక్స్, సంగీత విద్వాంసులు బాల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ రెండేళ్లుగా కాకినాడ పరిసర ప్రాంతాలలో సామాజిక సేవా కార్యక్రమాలు, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి సౌగంధికా అవార్డులు ప్రధాన చేయడమే కాకుండా, 300 మంది బ్రాహ్మణ మహిళలచే వరలక్ష్మి వ్రతం సందర్భంగా అష్టలక్ష్మి వైభవం నిర్వహించినట్లు చెప్పారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు మెట్ట రాధ మాట్లాడుతూ సౌగంధిక బ్రాహ్మణ మహిళ మణిహారం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మహిళలను అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురికి సౌగంధిక అవార్డులు పంపిణీ చేశారు. సంస్థను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న మెట్టా వెంకటేష్, చిట్నీడి శ్రీనివాస్‌తో పాటు పలువురిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారణాసి విజయలక్ష్మి, చావలి సూర్య కుమారి, ఆకెళ్ల పద్మ, వీరేశ్వరపు రాజి, దువ్వూరి శ్రీరామలక్ష్మి పాల్గొన్నారు.

జోడెడ్ల దౌడో దౌడు..

- రాష్ట్ర స్థాయి పోటీలకు సర్వం సిద్ధం
- సాధన చేయిస్తున్న రైతులు
- సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహణ



పందెం కోసం ఎడ్ల బళ్లతో వచ్చిన రైతులు

సామర్లకోట: ఎడ్ల పరుగు పోటీల్లో పాల్గొనే రైతులే మొదటిసారిగా పట్టణ పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఉండూరు రైల్వే గేటు ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం ఉదయం 6.30 నిమిషాలకు వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ శ్రీభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్లపరుగు పందాలు ప్రారంభిస్తున్నారు. తూర్పు, పశ్చిమ, కృష్ణ, విశాఖ, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశంలో ఎక్కువగా ఈ పోటీలు జరుగుతాయి. అయితే కర్నాటక, రాజస్థాన్, పంజాబ్, హుబ్లీలో కూడా ఇటువంటి పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో జరిగే పోటీలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని రైతులు తెలియజేస్తున్నారు. ఇప్పటికే అనేక జిల్లాల నుంచి ఎడ్లతో రైతులు సామర్లకోట చేరుకున్నారు. ముందుగా వచ్చిన రైతులకు పోటీలు పూర్తి అయ్యే వరకు నిర్వాహకులు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మారుతున్న కాలంతో ఎడ్లు అంతరించి పొయే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల విరాళాలతో ఎడ్లను ప్రోత్సహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నా మంటున్నారు. ప్రభుత్వం తరపున ఈ పోటీలను ఏర్పాటు చేస్తే రైతులు ఎడ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపడానికి అవకాశం ఉంటుందని చెప్తున్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో సీనియర్, జూనియర్ విభాగాలలో ఎడ్లబళ్లు పాల్గొంటాయి.

సీనియర్, జూనియర్ ఎడ్ల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా మెమెంటోలతో పాటు నగదు బహుమతులుగా ఇవ్వనున్నారు. పోటీల నిర్వాహకుడు సత్యేంద్రకుమార్ ఎక్కడ ఎడ్ల పరుగు పోటీలు జరిగినా పాల్గొన్ని బహుమతులు సాధించేవారు. అటువంటి వ్యక్తి మృతి చెందడంతో ఆయన పేరున ఆయన స్నేహితులు ఈ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు. పోటీలకు హాజరైన ఎడ్ల బళ్ల యజమానుల సమక్షంలో డ్రా తీసి సీరియల్ ప్రకారం వరుస క్రమంలో ప్రదర్శనకు అనుమతి ఇస్తామన్నారు. రైతు సంఘ నాయకులు, నిర్వాహకులు పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పోటీలు జరిగే ప్రదేశానికి చేరుకున్న ఎడ్ల రైతులు ఎడ్లతో దౌడులో సాధన చేయిస్తున్నారు.



పోటీలకు సేదతీరుతున్న ఎద్దులతో రైతులు

రాష్ట్రంలో ఎక్కడ జరిగినా సిద్ధం



రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన ఎక్కడ జరిగినా తమ ఎడ్లు పాల్గొంటున్నాయి. 25 ఏళ్లుగా వివిధ ప్రదర్శనలో పాల్గొనడం జరిగింది. ఇప్పటి వరకు అనేక పర్యాయాలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించాం. రాజానగరం సమీపంలో వెలుగుబందలో నిర్వహించిన పోటీలో బులెట్ మోటారు సైకిలును గెలుచుకున్నాం. ఈ పోటీలను ప్రభుత్వం తరఫున నిర్వహిస్తే రైతులకు మరింత ప్రోత్సాహం కల్పించవచ్చు.

– మలిరెడ్డి వీరేంద్ర, రైతు, జి.మేడపాడు

పోటీదారులకు వసతి సౌకర్యాలు



రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన, పోటీల్లో పాల్గొనే వారికి భోజనాలతో పాటు, ఎడ్లకు దాణా ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాల విజేత వల్లూరి సత్యేంద్రకుమార్ పేరుతో ఆయన అభిమానులం ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నాం. పరుగు నిర్వహించే రోడ్డును ఇప్పటికే శుభ్రం చేశాం. సీనియర్ విభాగంలో 12 జతలు, జూనియర్‌లో 40 జతల ఎడ్లు పాల్గొనే అవకాశం ఉంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయమే పోటీలు ప్రారంభిస్తాం.

– చేకూరి రామకృష్ణ, ఎడ్ల పోటీల నిర్వాహకుడు, సామర్లకోట

పిల్లలు బడిలోనే ఉండాలి

ఎంఈఓ–2 పుల్లయ్య



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం తదితరులు

సామర్లకోట: బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని పనిలో ఉండటానికి వీలులేదని ఎంఈఓ 2 పి.పుల్లయ్య అన్నారు. గురువారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్చే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. బడి మానివేస్తున్న పిల్లలు, వారి తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్చేలా చూడాలన్నారు. ఈ మేరకు విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో పిల్లలు చదువుకునేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫాం ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు భోజనం వడ్డించి అభిప్రాయాలను సేకరించారు. అందరూ కలిసి ఒక చోట భోజనం చేయడం వల్ల మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాసు, జి. బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున చెరువులో చేపల వేట వద్దు

- నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి
- కమిషనర్‌కు కౌన్సిలర్ వినతి
- నేటి నుంచి చేపల వేట నిషేధం



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతల హరిబాబు

సామర్లకోట: అధికారులు ప్రకటించిన నిబంధనల ప్రకారం నాగార్జున తాగునీటి చెరువులో చేపల వేటను నిషేధించాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఈనెల 15 లోగా చేపల వేటను పూర్తి చేయాలని మత్స్యకారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కాగా 20వ తేదీన కూడా వేట సాగిస్తున్నారని హరిబాబు ఆరోపించారు. ఏప్రిల్ మొదటి వారంలో గోదావరి కాలువ కట్టి వేసే అవకాశం ఉన్నందున నాగార్జున చెరువులో నీటిని పూర్తిగా తొలగించి కొత్త నీటితో నింపాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాటికి చేపల వేటను ముగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. చెరువులో నీటిని తొలగిస్తున్నామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు పార్కు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయని వాటిని తొలగించాలని నేతల హరిబాబు మరో వినతి పత్రం అందజేశారు. ఆక్రమణల తొలగింపుకు టీపీఓకు లిఖిత పూర్వకంగా లేఖ ఇచ్చినట్టు తెలిపారు.

చిన్నారుల భద్రతపై శిక్షణ



చైల్డ్‌సేఫ్‌పై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు డీఆర్‌డీఏ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో చిన్నారుల భద్రతపై గురువారం శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ సేఫ్ జిల్లాగా ప్రకటించడంలో భాగంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం సెర్ప్, ఏపీఎంలు, సీసీలు, గ్రామ సంఘం ప్రతినిధులు, వీఓఏలకు టీఓటీపై శిక్షణ ఇచ్చినట్టు పడాల చారిటిబుల్ ట్రస్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాల బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ వ్యక్తిగత విద్య, వ్యక్తిగత భద్రతా నియమాలు, ఇంటర్నెట్ సేఫ్టీ, పోక్సో చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డీఆర్‌డీఏ హెచ్‌డీ యాంకర్ పర్సన్ ఎ.అనిల్ కుమార్ మాట్లాడుతూ చైల్డ్ సేఫ్ కార్యక్రమాన్ని జిల్లాలోని 20 మండలాల్లో ఉన్న సెర్ప్, ఏపీఎంలు, సీసీలు, గ్రామ సంఘం ప్రతినిధులు, వీఓఏలకు టీఓటీపై శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణలో పలు అంశాలపై ప్రతి గ్రామంలోని ఎస్‌జీహెచ్ సభ్యులకు అవగాహన కల్పించాలని ఇలాంటి పరిస్థితులు ఎక్కడైనా వెలుగు లోకి వస్తే మండలంలో జెండర్ కమిటీ వారికి ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, సీసీఎం రాజకుమారి, సీసీకేలు పేరయ్య నాయుడు, వెంకటరమణ, ఎంఎస్‌ఏ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పిండ దశ నుంచే పిల్లల అభ్యాసం



శిక్షణనిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు

కాకినాడ క్రైం: పిల్లల అభ్యాసం పిండ దశ నుంచే ప్రారంభమవుతుందని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) జ్యోతి అన్నారు. శ్రవణం, స్పందన తల్లి గర్భం నుంచే మొదలవుతాయన్నారు. కాకినాడలోని స్థానిక ముత్తానగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 'పోషణ్ భీ పఢాయి భీ' పేరుతో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది.

ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి పర్యవేక్షణలో సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు 85 మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ తొలి రోజు ప్రారంభ సంవత్సరాల విద్య, ప్రీ స్కూల్ చైల్డ్ లక్షణాలు, అభివృద్ధి అవసరాలు, సమగ్ర అభివృద్ధి డొమైన్లు, పిల్లలను ఆకర్షించే వాతావరణాన్ని సిద్ధం చేయడం, స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో బొమ్మలు తయారు చేయడం, మెమొరీ గేమ్స్ అంశాలపై శిక్షణ నిచ్చామన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్లు ప్రభావతి, దయామణి, అరుణశ్రీలు బోధకులుగా వ్యవహరించారని తెలిపారు. శనివారం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు.

అట్టహాసంగా వారాహి ఉత్సవాలు

వెయ్యి కలశాలతో మహిళల ప్రదర్శన

కాకినాడ రూరల్: మండలం కొవ్వూరులో కొలువైన వారాహి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రితో ముగిశాయి. తొలుత భువనేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి వారాహి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు భారీ ఊరేగింపు, మేళతాళాలు, కోలాటం, తీన్మార్, చెన్నై చెండై వాయిద్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనల మధ్య ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ఊరేగింపుతో వెయ్యి కల శాలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అభిషేకాలు, హోమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మూడు రోజులు నిత్యం 10 వేలకు తక్కువ కాకుండా అన్న సమారాధన నిర్వహించారు. వారాహి అమ్మవారి శక్తి పీఠం నిర్వాహకురాలు వారాహి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో కాలా చినసత్యనారాయణ, పెండెం సత్యనారాయణ తదితర కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కొవ్వూరులో వారాహి అమ్మవారు



వెయ్యి కలశాలతో మహిళల గ్రామోత్సవం



కొవ్వూరులో వారాహి అమ్మవారి సన్నిధిలో భక్తులు



ఉత్సవాల్లో మహిళల కోలాటం



మరిడమ్మతల్లిని దర్శించిన జడ్జి



ఆలయంలో పూజ చేస్తున్న పిఠాపురం జడ్జి రామేశ్వరి

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో జడ్జి ఎం.విజయ రామేశ్వరి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా వేద పండితుల ఆశీర్వచనం చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దాపురం: మండలంలోని సిరివాడ గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఉచిత కంటి వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి తుని సబ్ జోన్ కన్వీనర్ తుమ్మల పల్లి జోగేంద్రనాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వేమగిరి పరమాంస యోగానంద నేత్రాలయం వైద్య సిబ్బంది కంప్యూటర్ ద్వారా చత్వారం, తలపోటు పరీక్షలు ఉచితంగా నిర్వహించి ముందులు ఇస్తారన్నారు. వివరాలకు 99516 76189, 63058 57192 నంబర్లను సంప్రదించాలని జోగేంద్రనాథ్ తెలిపారు.

23న సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతతో హాజరుకావాలన్నారు. ఉదయం 10.30కు ప్రారంభమయ్యే ఈ సమవేశానికి ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావలాన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీలలిత తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

సబ్సిడీపై మినుములు, పెసలు

కొత్తపల్లి: రైతులకు అపరాల పంట కోసం సబ్సిడీపై మినుములు, పెసలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో 15 క్వింటాళ్ల వీబీఎస్–8 రకం మినుములు, 60 క్వింటాళ్ల విరాట్ రకం పెసలు అందుబాటులో ఉన్నాయన్నారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు వీటిని అందిచడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు పొలానికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో గ్రామ సచివాలయ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప: భర్త వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం పెద్దాపురప్పాడు శివారు వై.సావరం గ్రామానికి చెందిన కోరం రాజశేఖర్‌తో తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన సాధన (28)కు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వివాహం జరిగినప్పటి నుంచి సాధనను అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న రాత్రి 8.30 గంటల సమయంలో భార్యా భర్తలు గొడవపడ్డారు. ఆ గొడవలో సాధనను రాజశేఖర్ చస్తే చావు అన్నాడు. దీంతో ఆమె ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగేసింది. ఆమెను చికిత్స కోసం కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెగా జాబ్ డ్రైవ్‌లో 129 మందికి ఉద్యోగాలు

కాకినాడ సిటీ: కాకినాడ అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్‌లో 129 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి తెలిపారు. డ్రైవ్‌లో జేకేసీ కో ఆర్డినేటర్ పి.సంజోత, హెచ్‌ఆర్ సిబ్బంది విజయలక్ష్మి, జి.రాజేష్, కె ఉదయ్‌శంకర్, బి సంతోష్, స్నేహలత, వైస్ ప్రిన్సిపాల్ మల్లెల సువర్చల, కో ఆర్డినేటర్ ఎం వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పారో డే, ఫ్రాగ్ డే..

కళాశాల జువాలజీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ స్పారో డే, వరల్డ్ ఫ్రాగ్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి పర్యావరణంలో పిచుకలు, కప్పల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐక్యూఏసి కో ఆర్డినేటర్ ఎం.వసంత లక్ష్మి, జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాలతో నేల సారవంతం

కరప: రబీ కోతలకు ముందు పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) విత్తనాలు చల్లడం వల్ల నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసా యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియాజర్ అన్నా రు. మండలం కొంగోడులోని ప్రకృతి వ్యవసా యం యూనిట్‌ను గురువారం ఆయన పరిశీలించి, రైతులు, సిబ్బందితో మాట్లాడారు. జిల్లా ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఎంటీ ధనలక్ష్మి, కరప డివిజన్ మెంటల్ అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.